నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, సోమవారం 5 ఆగస్టు 2024 | VIKARABAD

భవిష్యత్ బీఆర్ఎస్‌దే

పదవులు ఎవరికీ శాశ్వతం కాదని, భవిష్యత్ బీఆర్ఎస్‌దేనని మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఆమె తనయుడు కార్తిక్‌రెడ్డి, కందుకూరు మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని ఆయన స్వగృహంలో ఆదివారం కలిశారు.
ఈ సందర్భంగా కేసీఆర్ పలు విషయాలను వారిని అడిగి తెలుసుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చూపాలన్నారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు మన్నె జయేందర్ ముదిరాజ్, మార్కెట్ మాజీ చైర్మన్ సురుసాని సురేందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, మాజీ చైర్మన్ ర్యాపాకు ప్రభాకర్‌రెడ్డి, ఎలుక మేఘనాథ్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు గంగాపురం లక్ష్మీనర్సింహా రెడ్డి, మాజీ డైరెక్టర్లు పాట్టి ఆనంద్ తదితరులు ఉన్నారు.

- కందుకూరు, ఆగస్టు 4

ఏకగ్రీవంగా టీజీవో కార్యవర్గం ఎన్నిక

రంగారెడ్డి, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీవో) రంగారెడ్డి జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ఎన్నికల్లో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కే రామారావు, అసోసియేట్ ప్రెసిడెంట్లుగా వెంకటేశ్, పీసీ వెంకటేశం, వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్.రేవతి దేదీప్య, సెక్రటరీగా శ్రీనేష్ కుమార్ నోరి, జాయింట్ సెక్రటరీలుగా కే అనిత, పీ లక్ష్మణ స్వామి, ఉమెన్ జాయింట్ సెక్రటరీగా జీ మహేశ్వరి, ట్రెజరర్‌గా ఎన్.శ్రీనివాసులు, ఆర్గనైజేషన్ సెక్రటరీగా డాక్టర్ పీ యుగంధర్ రెడ్డి, పబ్లిసిటీ సెక్రటరీగా ఎల్.రవీందర్, ఆఫీస్ సెక్రటరీగా డీ సుజాత, కల్చరల్ సెక్రటరీగా ఏ వెంకటేశ్వర్లు, స్పోర్ట్స్, గేమ్స్ సెక్రటరీగా ఓ.శివ కుమార్, ఈసీ మెంబర్స్‌గా డాక్టర్ కే నరేందర్, వీ శ్రవణ్ కుమార్, ఏ నరేందర్ గౌడ్, బీ సుజాతలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, సెక్రటరీ ఏనుగుల సత్యనారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్ శ్యామ్, ట్రెజరర్ ఉపేందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ జగన్మోహన్‌రావు, జాయింట్ సెక్రటరీ పరమేశ్వర్‌రెడ్డి, లేడీ రిప్రజెంటేటివ్ దీపా రెడ్డి, ఈసీ మెంబర్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

టీజీవో నూతన కార్యవర్గం

వరద నీరు ఇంకేలా.. భూగర్భ సంపులు

ప్రయోగాత్మకంగా 12 చోట్ల పనులకు జీహెచ్ఎంసీ శ్రీకారం

సిటీబ్యూరో, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో వరద నీటి నివారణకు సరికొత్త విధానాన్ని జీహెచ్ఎంసీ అమలు చేస్తున్నది. దాదాపు 140 చోట్ల వర్షపు నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించిన అధికారులు.. నీరు ఇంకిపోయేలా సంపుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 10 నుంచి 40 లక్షల లీటర్ల సామర్థ్యంతో 150 అడుగుల ఇంజక్షన్ బోర్‌వెల్స్ వేసి వరదను కట్టడి చేసేందుకు చర్యలకు ఉపక్రమించారు. సుమారు రూ. 20 కోట్లతో ప్రయోగాత్మకంగా 12 చోట్ల భూగర్భ సంపుల నిర్మాణ పనులను చేపడుతున్నారు. ఇందులో భాగంగానే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం ఎదుట 10 లక్షల లీటర్ల వర్షపు నీటి నిల్వ సామర్థ్యంతో సంపుల నిర్మాణ పనులను మొదలు పెట్టారు. సచివాలయం ఎదురుగా తెలుగు తల్లి వంతెన పక్కనున్న బస్టాపుల వద్ద భారీగా వర్షపు నీరు నిలుస్తున్నదని, అందుబాటులో ఉన్న స్థలాన్ని బట్టి విస్తీర్ణాన్ని నిర్ధారిస్తున్నామని ఇంజినీరింగ్ విభాగం అధికారులు పేర్కొన్నారు. ఈ స్థలంలో నాలుగు ఇంజక్షన్ బోర్‌వెల్స్ వేశారు. ఒక్కొక్కటి 80 అడుగుల లోతుతో వేసినట్లు అధికారులు చెప్పారు. కాగా, నిర్ణీత స్థాయిలో వర్షపు నీరు వచ్చి చేరగానే సంపులో ఆటోమెటిక్‌గా మోటర్లు ఆన్ అయ్యేలా సెన్సార్లు ఏర్పాటు చేశారు. దీంతో వెంటనే వరద నీటి సమస్యకు పరిష్కారం లభించనుంది. ఈ తరహాలో 12 చోట్ల ప్రయోగాత్మకంగా సంపుల నిర్మాణాలు చేపడుతున్నారు. మిగిలిన చోట్ల టెండర్ దశలో ఉన్నాయని, త్వరలోనే అన్ని చోట్ల పనులు ప్రారంభించి ఈ వర్షాకాలం ముగింపు నాటికల్లా పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

ఇప్పటివరకు రంగారెడ్డి జిల్లాలో అధికారికంగా 119 డెంగీ కేసులు నమోదు

పల్లెలు, పట్టణాల్లో పారిశుధ్యం అస్తవ్యస్థం

కిక్కిరిసిపోతున్న ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానలు

ముందస్తు చర్యలపై దృష్టిసారించని వైద్యారోగ్యశాఖ

జిల్లాలో మొక్కుబడిగా సాగుతున్న జ్వర సర్వే

జిల్లావాసులను జ్వరాలు వెంటాడుతున్నాయి. వాతావరణ మార్పులతో పట్టణాలు, పల్లెల్లో బాధితులు రోజురోజుకూ పెరుగుతున్నారు. చికిత్స కోసం వస్తున్న వారితో ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానలు కిక్కిరిసిపోతున్నాయి. వైద్యశాఖలో ఇటీవల చేపట్టిన బదిలీల నేపథ్యంలో ముందస్తు చర్యలపై అధికారులు దృష్టి సారించలేకపోయారు. జ్వర సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ మొక్కుబడిగానే సాగుతున్నది. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా డెంగీ కేసులు అధికారికంగా 119 నమోదైనప్పటికీ వాస్తవంగా ఇంతకంటే ఎక్కువగానే ఉండే అవకాశం ఉన్నది.

- రంగారెడ్డి, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ)

విష జ్వరం.. భయం..భయం

అత్యధికులకు డెంగీ లక్షణాలు

దోమల నియంత్రణకు కార్యాచరణ ఏదీ ?

పల్లె, పట్టణం అనే తేడా లేకుండా జ్వరాలు విజృంభిస్తున్నాయి. జ్వర బాధితులు లేని ఇల్లు ఉండడం లేదు. ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోకపోవడం, ఖాళీ స్థలాల యజమానులు తమ స్థలాల్లో పేరుకుపోయిన చెత్త, కలుపు మొక్కలు, నీటి నిల్వలపై దృష్టి పెట్టకపోవడంతో జిల్లాలో దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులు ఎక్కువగా నమోదవుతున్నాయి. వర్షాలకు పలుచోట్ల రహదారులు కోతకు గురై గుంతలు ఏర్పడి నీరు నిల్వడంతో దోమలు వృద్ధిచెంది పగలు, రాత్రి అనే తేడా లేకుండా కుడుతూ కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రగతి కార్యక్రమాలు చేపట్టి చాలాచోట్ల నీటి నిల్వలు, దోమల ఆవాస కేంద్రాలు లేకుండా చేస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం కనబడడం లేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు.

పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పారిశుధ్య చర్యలు, దోమల నివారణ, ఇంటింటికీ చెత్త సేకరణ నిర్వహణ కార్యక్రమాలు నామమాత్రంగా సాగుతున్నాయి. సిబ్బంది చోద్యం చూడడమే తప్ప పారిశుధ్యం, వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టడం లేదంటూ నిత్యం ప్రజల నుంచి అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

పడగ విప్పుతున్న డెంగీ..

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానలు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. డెంగీ, మలేరియా, వైరల్ ఫీవర్ బారిన పడి చికిత్స పొందుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు తీవ్ర జ్వరం, దగ్గు, జలుబు తలనొప్పితో బాధపడుతూ దవాఖానలకు క్యూ కడుతున్నారు. మరికొందరు తీవ్ర జ్వరం, కఫంతో ఊపిరి తీసుకోవడానికి ఇబ్బందులు పడుతూ వైద్యశాలల్లో ఇన్‌పేషెంట్లుగా చేరి రోజుల తరబడి చికిత్సలు పొందుతున్నారు. జ్వరాల బారిన పడిన వారిలో చాలామందికి డెంగీ లక్షణాలు ఉంటున్నాయి. జిల్లాలోని 42 పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల పరిధిల్లో ఇప్పటి వరకు జీహెచ్ఎంసీ పరిధిలో 77 డెంగీ కేసులు నమోదు కాగా.. మున్సిపాలిటీల్లో 37 కేసులు, రూరల్‌లో 5 కేసులు కలిపి మొత్తం 119 కేసులు నమోదైనట్లు వైద్యవర్గాలు చెబుతున్నాయి. వాస్తవంగా ఇంతకంటే ఎక్కువ సంఖ్యలోనే డెంగీ బాధితులు ఉన్నట్లు ప్రస్తుత పరిస్థితులను చూస్తే తెలుస్తున్నది. జ్వరాలు విజృంభిస్తుండడంతో ఇదే అదనుగా ప్రైవేటు వైద్యశాలలు బాధితులను నిలువుదోపిడీ చేస్తున్నాయి. ప్లేట్‌లెట్లు తగ్గాయని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. చిన్నపాటి జ్వరంతో వెళ్లినా ఐసీయూలో ఉంచి టెస్ట్‌లు, చికిత్స పేరిట దవాఖాన సిబ్బంది వేలల్లో బిల్లులు వసూలు చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మొక్కుబడిగా జ్వర సర్వే..

సీజనల్ వ్యాధుల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కొద్ది రోజుల కింద రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వైద్యారోగ్య శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇంటింటికీ వెళ్లి జ్వర సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. మలేరియా, డెంగీలను నివారించడంతోపాటు అవసరమైన వారికి చికిత్స అందించడానికి ఈ సర్వే దోహదపడుతుందని ప్రభుత్వం భావించింది. జిల్లాలో కొన్నిచోట్ల జ్వర సర్వే మొక్కుబడిగానే సాగుతున్నట్లు తెలుస్తున్నది. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు, మల్టీ పర్పస్ హెల్త్ సూపరింటెండెంట్లతో బృందాలను ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ చాలాచోట్ల మొక్కుబడిగానే ఈ ప్రక్రియను చేపట్టినట్లు తెలుస్తున్నది. నిన్న మొన్నటి వరకు వైద్యారోగ్యశాఖలో బదిలీల ప్రక్రియ కొనసాగడంతో జ్వర సర్వేపైన ఎవరూ అంతగా దృష్టి సారించలేకపోయారని ఆరోపణు వినిపిస్తున్నాయి. పల్లె, బస్తీ దవాఖానలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడం వంటి కారణాల నేపథ్యంలో జ్వరాల సమస్య మరింత జఠిలంగా మారిందని జిల్లావాసులు పేర్కొంటున్నారు.

చేవెళ్ల ఏరియా దవాఖాన

దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

'గురుకులం'లో జాండీస్ కలకలం

విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశం

వికారాబాద్, ఆగస్టు 4 : వికారాబాద్ పట్టణంలోని శివారెడ్డి గురుకుల పాఠశాలలో పలువురు విద్యార్థులకు ఆదివారం జాండీస్ సోకాయి. దీంతో పాఠశాల సిబ్బంది చికిత్స నిమిత్తం 15 నుంచి 20 మంది విద్యార్థులను వికారాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. అలాగే వికారాబాద్ పట్టణంలోని బూరుగుపల్లి సమీపంలో బాలికల గురుకుల పాఠశాలలోని విద్యార్థినులకు జ్వరాలు వచ్చాయి. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గురుకుల పాఠశాలల పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.

ప్రాణాలు తీసిన అతివేగం

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం

కొండాపూర్ ఫ్లైఓవర్ నుంచి పడి ఇద్దరు..

లారీ కిందపడి మరొకరు

కొండాపూర్/మాదాపూర్ ఆగస్టు 4 : నగరంలో ఆదివారం వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. అతి వేగం..నిర్లక్ష్యం వల్లే ఈ దుర్ఘటనలు చోటుచేసుకున్నాయి. గచ్చిబౌలి పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని గుంటూరు జిల్లా రొంపిచర్ల మండలం విప్పర్ల గ్రామానికి చెందిన బాల ప్రసన్న (24) బీటెక్ పూర్తి చేసి.. ఉద్యోగం కోసం నగరానికి వచ్చాడు. అదే మండలం మర్రిచెట్టుపాలెం గ్రామానికి చెందిన అతడి స్నేహితుడు రోహిత్ (26) ఐటీ కారిడార్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో పనిచేస్తున్నాడు. ఆదివారం తెల్లవారు జామున వీరిద్దరూ కలిసి బైక్‌పై మజీద్‌బండ వైపు నుంచి హఫీజ్‌పేట్ వైపు వెళ్తున్నారు. బైక్ నడుపుతున్న రోహిత్ మితిమీరిన వేగంతో బొటానికల్ గార్డెన్ సమీపంలోని కొండాపూర్ ఫ్లైఓవర్‌పైకి వెళ్లాడు. వంతెన మలుపులో అదుపుతప్పి రెయిలింగ్‌ను బలంగా ఢీకొట్టాడు. ప్రసన్న, రోహిత్ ఇద్దరు ఫ్లైఓవర్‌పై నుంచి కిందపడిపోయారు. తీవ్రంగా గాయపడిన వీరిద్దరిని దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ చనిపోయారు. గచ్చిబౌలి పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

లారీ కిందపడి..

లారీ కిందపడి ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ మోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని అమలాపురానికి చెందిన ప్రవీణ్ (25), అరిగాలి జై స్వామి శంకర్ (24) సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్ ఐసీఐసీఐ బ్యాంక్ ఇన్సురెన్స్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తూ.. కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్ 6 లో నివాసముంటున్నారు. ఆదివారం తెల్లవారు జామున స్నేహితులను కలిసేందుకు ద్విచక్రవాహనంపై వీరిద్దరూ నిర్లక్ష్యంగా.. వేగంగా జేఎన్‌టీయూ నుంచి మాదాపూర్ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో బండి అదుపుతప్పడంతో ప్రవీణ్ సడెన్ బ్రేక్ వేయగా, వెనకాల కూర్చున్న జై స్వామి శంకర్ ఎగిరి అటుగా వెళ్తున్న లారీ కింద పడి మృతిచెందాడు. ప్రవీణ్ గాయాలతో బయటపడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అటకెక్కిన ఎకో టూరిజం

అనంతగిరి అడవిలో జలపాతం

- స్వదేశ్ దర్శన్‌కు ఎంపికైనా ముందుకెళ్లని 'అనంతగిరి' ప్రగతి పనులు
- 213 ఎకరాల్లో రూ.118 కోట్లతో పర్యాటకాభివృద్ధికి ప్రణాళికలు
- డీపీఆర్ పూర్తయి ఆరు నెలలైనా ప్రారంభంకాని టెండర్ల ప్రక్రియ

వికారాబాద్, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఊటీగా పిలువబడే అనంతగిరి హిల్స్‌కు పర్యాటకుల తాకిడి పెరుగుతున్నది. నిత్యం వేల సంఖ్యలో సందర్శకులు వస్తుంటారు. ఇక వీకెండ్‌లో అయితే హైదరాబాద్ నుంచి వికారాబాద్ వరకు వాహనాలు క్యూ కడుతాయి. అనంతగిరి హిల్స్ అందాలపై రాష్ట్రవ్యాప్తంగా ఆదరణ పెరిగినప్పటికీ పర్యాటకంగా అభివృద్ధి చేయడాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తున్నది. కనీస వసతులు లేక పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. కొడంగల్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి అనంతగిరి హిల్స్‌పై సవతితల్లి ప్రేమను చూపిస్తున్నారని జిల్లావాసులు ఆరోపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎంపిక చేసిన అనంతగిరి ఎకో టూరిజంపై బడ్జెట్‌లో ప్రస్తావించినప్పటికీ ప్రత్యేకంగా నిధులు కేటాయించకపోవడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వం గతంలోనే కొంతమేర నిధులు కేటాయించగా, రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులకు సంబంధించి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. ఎన్నికల సమయంలో అనంతగిరిని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని హామీనిచ్చి ఇప్పుడు విస్మరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తుండడంతోపాటు అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ సొంత నియోజకవర్గంలోనే అనంతగిరి హిల్స్ ఉన్నప్పటికీ పట్టించుకోకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పెండింగ్‌లోనే టెండర్ల ప్రక్రియ..

అనంతగిరి టూరిజం అభివృద్ధికి సంబంధించి ఎల్అండ్‌టీ సంస్థ రూపొందించిన మాస్టర్ ప్లాన్‌కు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతోపాటు డీపీఆర్‌కు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇప్పటికీ ఆరు నెలలు గడిచినా టెండర్ల ప్రక్రియపై ఆలోచన చేయడం లేదు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో స్వదేశ్ దర్శన్‌లో భాగంగా జిల్లాలోని అనంతగిరి హిల్స్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కేంద్రం ఎంపిక చేసింది. అందుకోసం కేంద్రం నిధులు ఇవ్వనుండగా.. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వాల్సి ఉన్నది. పార్లమెంట్ ఎన్నికల అనంతరం స్వదేశ్ దర్శన్‌పై కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆసక్తి చూపడం లేదు. హామీలను నమ్మి ఓటేసి గెలిపిస్తే స్థానికంగా గెలిచిన ఎంపీతోపాటు ఎమ్మెల్యేలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాల్సింది పోయి అనంతగిరి హిల్స్ అభివృద్ధిపై ప్రస్తావించకపోవడంపై జిల్లావాసులు మండిపడుతున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అనంతగిరి ఎకో టూరిజాన్ని ప్రస్తావించారే తప్పా నిధులపై స్పష్టతనివ్వలేదు.

213 ఎకరాల్లో ..

అనంతగిరి ఎకో టూరిజానికి సంబంధించి 213 ఎకరాల్లో టూరిజం అభివృద్ధికిగాను తయారు చేసిన డీపీఆర్‌ను అమోదించారు. అనంతగిరి హిల్స్‌లోని టూరిజం అభివృద్ధికి గుర్తించిన 213 ఎకరాల్లో 177 ఎకరాల్లో ఎకో టూరిజంతోపాటు కన్వెన్షన్ సెంటర్, హోటల్, రిసార్టు, కాటేజెస్, ఆంపీ థియేటర్, పర్యాటకులను ఆకర్షించేందుకుగాను అటవీ ప్రాంతంలో ఇంటిగ్రేటెడ్ వెల్‌నెస్ సెంటర్, శారీరక దృఢత్వానికి యోగా, ధ్యాన కేంద్రాలు, స్పా, స్విమ్మింగ్ పూల్, వాకింగ్ ట్రాక్, సైక్లింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేయనున్నారు. అడవిలోని వివిధ రకాల పక్షులను వీక్షించేందుకు వీలుగా వాచ్ టవర్లను నిర్మించడంతోపాటు రోప్ వే ను కూడా నిర్మించేందుకు ప్లానింగ్ చేశారు. మరో 37 ఎకరాల్లో పార్కింగ్ ఏరియాతోపాటు రోడ్లు, మరుగుదొడ్లు, తాగునీటి వసతికి, గ్రీనరీని ఏర్పాటు చేయనున్నారు. అనంతగిరి హిల్స్‌లోని అనంతపద్మనాభ స్వామి ఆలయం చుట్టూ సుందరీకరణతోపాటు పార్కింగ్, లైటింగ్, ఫంక్షన్ హాల్ నిర్మాణం, వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.

అనంతగిరితోపాటు కోట్‌పల్లి, సర్పన్‌పల్లి ప్రాజెక్టులను కూడా టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. కోట్‌పల్లి, సర్పన్‌పల్లి ప్రాజెక్టుల్లో కాటేజ్‌లతోపాటు రెస్టారెంట్లు, బోటింగ్, స్పీడ్ బోట్స్, వాటర్ స్పోర్ట్స్, ఆంపీ థియేటర్, రిసెప్షన్, ఆర్చ్‌లను ఏర్పాటు చేయనున్నారు. అనంతగిరి హిల్స్‌తోపాటు కోట్‌పల్లి, సర్పన్‌పల్లి ప్రాజెక్టుల్లో టూరిజం అభివృద్ధికిగాను కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు రూ.118 కోట్లను ఖర్చు చేసేందుకు ప్రతిపాదించారు.

పర్యాటకులకు ఇబ్బందులు...

వారాంతపు సెలవుల్లో అనంతగిరి పర్యాటకులతో కిటకిటలాడుతున్నది. అనంతగిరిలోని ప్రసిద్ధ పద్మనాభస్వామిని దర్శించుకోవడంతోపాటు అటవీ ప్రాంతంలో ట్రెక్కింగ్ చేసేందుకుగాను అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివస్తున్నారు. కెరెళ్లి వెళ్లే దారిలో నంది విగ్రహం, ఎత్తైన అటవీ ప్రాంతంలో నుంచి వచ్చే వాటర్ ఫాల్స్ వద్ద పర్యాటకులు సేద తీరుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున పర్యాటకులు వస్తుంటారు. కనీస వసతులు లేక పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు.

అనంతపద్మనాభస్వామి ఆలయం

అనంతగిరి అటవీ ప్రాంతంలో సినిమా షూటింగ్(ఫైల్)